నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి, మే 31: గగన్‌పహాడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతాయం విధిస్తున్నట్లు విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. పద్మశాలిపురం ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి ఒంటి గంట వరకు పద్మశాలిపురం, మధుబన్, ఆప్కో, సాయి, టీఎన్‌జీవోస్‌కాలనీలు, మీనా కెమికల్ ఫీడర్ పరిధిలో మీనా కెమికల్, మెట్రోహిల్స్, సుమో ఫుడ్స్ ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా కోత విధిస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చాలి

హిమాయత్‌నగర్, మే 31: తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేండ్లు పూర్తికానున్న నేపథ్యంలో తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పదో ఆవిర్భావం సందర్భంగా విద్యార్థుల సంక్షేమానికి కృషి చేస్తూ బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని అన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. యూనివర్సిటీలకు అధిక ప్రాధాన్యత కల్పించి, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జాబ్ క్యాలెండర్ ప్రకటించాలన్నారు. సబ్బండ వర్గాలకు భరోసా కల్పించే విధంగా జూన్ 2న సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగం ఉండాలని కోరారు.

డీ మార్ట్‌లో బాలిక గొలుసు మాయం

బంజారాహిల్స్, మే 31: షాపింగ్‌కు తల్లిదండ్రుల వెంట వచ్చిన బాలిక మెడలోంచి బంగారు గొలుసు చోరీ అయ్యింది. ఈ ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. లంగర్‌హౌజ్ ప్రాంతానికి చెందిన జి.జయశ్రీ తన ఐదేళ్ల కుమార్తె మహతితో కలిసి గురువారం మధ్యాహ్నం షేక్‌పేట ప్రధాన రహదారిలో ఉన్న డీ మార్ట్‌కు వచ్చింది. షాపింగ్ చేస్తున్న జయశ్రీ వెంట ఉన్న కుమార్తె మహతి కొంత దూరంలో ఉండగా.. బుర్కా ధరించి ఉన్న ఓ మహిళ బాలిక వద్దకు వచ్చి మెడలోని తులం బంగారు గొలుసును కాజేసింది. కొద్ది సేపటి తర్వాత తల్లివద్దకు వచ్చిన మహతి తన మెడలోని గొలుసును మహిళ తీసుకువెళ్లినట్లు చెప్పింది. దీంతో సదరు మహిళ కోసం గాలించగా ఆమె కనిపించలేదు. డీ మార్ట్‌లోని సీసీ పుటేజీని పరిశీలించగా.. బాలిక మెడలోంచి గొలుసు తస్కరించినట్లు తేలింది. ఈ మేరకు గురువారం రాత్రి జయశ్రీ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదుతో ఐపీసీ 379 సెక్షన్ కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పనిచేస్తున్న సంస్థకు టోకరా.. కేసు నమోదు

బంజారాహిల్స్, మే 31: పనిచేస్తున్న సంస్థకు టోకరా వేసిన అకౌంటెంట్‌పై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. బంజారాహిల్స్ రోడ్ నం. 3లోని అరిజన్ ప్లాజాలో ఉన్న అవిలా టూర్స్ అండ్ ట్రావెల్స్ సంస్థలో ఎండీ షకీల్ అహ్మద్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా సంస్థకు చెందిన బిల్లుల్లో అవకతవకలకు పాల్పడుతున్నట్లు గుర్తించిన సంస్థ డైరెక్టర్ లక్ష్మీ అంగార ఆడిటింగ్ చేయించారు. దీంతో సుమారు రూ. 5.42 లక్షల మేర మోసం జరిగినట్లు గుర్తించారు. ఈ మేరకు అకౌంటెంట్ షకీల్ అహ్మద్‌పై చర్యలు తీసుకోవాలంటూ లక్ష్మీ అంగార ఇచ్చిన ఫిర్యాదుతో బంజారాహిల్స్ పోలీసులు ఐపీసీ 420, 406 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

శంషాబాద్ రూరల్, మే 31: నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి కవిత తెలిపారు. శుక్రవారం శంషాబాద్ వ్యవసాయశాఖ-పోలీస్ శాఖ సంయుక్తంగా శంషాబాద్ మండలంలోని కవేలిగూడ వద్ద ఉన్న ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. కవిత మాట్లాడుతూ.. అనుమతులు ఉన్న షాపుల్లోనే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. రైతులకు నష్టాలు లేకుండా చేయడం కోసం ప్రభుత్వ శాఖల అధికారులు అవగాహన కల్పించడంతో పాటు ఫర్టిలైజర్ షాపుల్లో విత్తనాల నిల్వను ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేయడంతో పాటు రైతులకు ఖచ్చితంగా రసీదులు ఇవ్వాలని సూచించారు. వ్యవసాయ అధికారి కవితతో పాటు శంషాబాద్ ఎస్ఐ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరాంఘర్ కూడలిలో పొగాకుపై అవగాహన కల్పించిన జిల్లా మెడికల్ అధికారులు, సిబ్బంది

కేబీఆర్ పార్కువద్ద యాంటీ టోబాకో వాక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కె.రాజశేఖర్‌రెడ్డి

పొగాకు ప్రాణానికి ముప్పు

బండ్లగూడ, మే 31: పొగాకుతో ప్రాణాలకే ముప్పని రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. అంతర్జాతీయ పొగాకు దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఆరాంఘర్ చౌరస్తా నుంచి జిల్లా వైద్యాధికారి కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. పొగాకు పట్ల జరిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ.. పొగాకు కాన్సర్‌కు కారకమని అన్నారు. పొగాకును పిల్చడం ద్వారా పక్కన ఉన్నవారికి కూడా ప్రమాదమే అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ వర్సిటీలో..

వ్యవసాయ యూనివర్సిటీ, మే 31: కొండాలక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాలలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రశాంత్ ఆధ్వర్యంలో పొగాకు ఉత్పత్తుల వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు పొగాకు వ్యతిరేక దినోత్సవంపై ర్యాలీలను నిర్వహించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి లావణ్య సంతోషిణి, వ్యాసరచన, వక్తృత్వ, పోస్టర్ తయారీ, నాటిక పోటీలను నిర్వహించి విజేతలకు ప్రతిభాపురస్కారం అందజేశారు. ఇతర బోధన, బోధనేతర సిబ్బంది మమత, వేణు, పూజ, శ్రీకాంత్, అశోక్ పాల్గొన్నారు.

యాంటీ టొబాకో వాక్

బంజారాహిల్స్, మే 31: అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కువద్ద శుక్రవారం ఇండియన్ డెంటల్ అసోసియేషన్, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డెంటిస్ట్రీ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన వాక్ నిర్వహించారు. నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి వాక్‌ను ప్రారంభించి మాట్లాడారు. పొగాకు వినియోగంతో క్యాన్సర్ ముప్పుతో పాటు నోటి ఆరోగ్యం కూడా దెబ్బతింటుందన్నారు. గొంతు క్యాన్సర్, దంత సంబంధిత సమస్యలు పొగాకు వాడకంవల్ల తీవ్రతరమవుతాయన్నారు. ముఖ్యంగా పాన్ మసాలా, గుట్కాలతో జరుగుతున్న నష్టాన్ని గుర్తించి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వాటిపై నిషేధం విధించిందని గుర్తుచేశారు. పొగాకు ఉత్పత్తులను వాడటం అంటే మృత్యువులు ఆహ్వానించడమే అనే విషయాన్ని ప్రజలందరూ గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డా.రమణారెడ్డి, డా. చేతన్‌కుమార్, డా.శ్రీకాంత్, డా.సుధీర్ రెడ్డి. ఆదిత్య, సందీప్, హసన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజం కోసం..

ఖైరతాబాద్ : పొగాకు ఉత్పత్తులను వీడితేనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ ఎ.అశోక్ అన్నారు. వరల్డ్ నో టొబాకో డే సందర్భంగా డాక్టర్ రావుస్ ఓరల్ హెల్త్ ఫౌండేషన్, డాక్టర్ ఓఎన్ రావు చారిటబుల్ ట్రస్ట్, సాయం సంస్థ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అవగాహన సదస్సు వైవజ్ఞశర్మ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన అశోక్ మాట్లాడుతూ.. పొగాకు వ్యాపకంగా మారిపోయిందని, యువత బానిస అవుతున్నారని అన్నారు. రావూస్ ఓరల్ హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రావు, ఫౌండేషన్ కోఆర్డినేటర్ కుసుమ భోగరాజు, సీరియర్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ జి.సూర్యనారాయణ రాజు, సాయం ఆర్గనైజేషన్ కోఫౌండర్ సుధీర్ నల్లరాతి, సినీ సంగీత దర్శకుడు బల్లేపల్లి మోహన్ పాల్గొన్నారు.

పొగాకు నివారణ ర్యాలీలో పాల్గొన్న డీన్ ప్రశాంత్ తదితరులు

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ అశోక్, డాక్టర్ సూర్యనారాయణ రాజు, డాక్టర్ చిట్టిబాబు

సినీ పరిశ్రమలో ఉపాధిలేక.. చోరీలు!

- బైక్ దొంగగా మారిన మేకప్ ఆర్టిస్టు
- అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు

బంజారాహిల్స్, మే 31: సినీ పరిశ్రమలో సరైన ఉపాధి లేకపోవడంతో బైక్ దొంగతనాలు చేస్తున్న వ్యక్తితో పాటు అతడి వద్ద నుంచి బైక్ కొనుగోలు చేసిన మరో వ్యక్తిని కూడా బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి కథనం ప్రకారం.. యూసుఫ్‌గూడ కృష్ణానగర్‌లో నివాసముంటున్న పొట్లూరి చంద్రశేఖర్ (38) సినీ పరిశ్రమలో మేకప్ ఆర్టిస్టుగా పనిచేస్తున్నాడు. ఆరు నెలలుగా సరిగా షూటింగ్స్ లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. దీంతో ఇద్దరు పిల్లలతో అతడి భార్య సొంతూరు వెళ్లిపోయింది. దీంతో మద్యానికి బానిసైన చంద్రశేఖర్ డబ్బు కోసం బైక్ దొంగగా మారాడు. ఈ క్రమంలో మే 25న శ్రీనగర్ కాలనీలో పార్క్ చేసిన యాక్టివా బైక్‌ను తస్కరించాడు. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన బంజారాహిల్స్ డీఐ బషీర్ అహ్మద్ నేతృత్వంలోని క్రైం పోలీసులు సీసీ పుటేజీ సాయంతో నిందితుడిని గుర్తించి, శుక్రవారం అరెస్టు చేశారు. గడిచిన నాలుగు నెలల్లో బంజారాహిల్స్ పీఎస్ పరిధిలో 4 బైక్‌లను చోరీ చేసినట్లు విచారణలో తేలింది. దీంతో పాటు అబ్దుల్లాపూర్ మెట్‌లో కూడా ఓ బైక్ చోరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. చోరీ చేసిన బైక్‌లను తనతో పాటు సినీ పరిశ్రమలో పనిచేస్తున్న వెంకటసత్యనారాయణ(60)కు విక్రయించినట్లు చెప్పాడు. ఆరు నెలలుగా ఒక్కరోజు కూడా షూటింగ్ పని దొరకలేదని, విధిలేని పరిస్థితిలో దొంగతనాలు చేస్తున్నానంటూ నిందితుడు చంద్రశేఖర్ పోలీసుల విచారణలో చెప్పాడు. ఈ మేరకు నిందితుడు చంద్రశేఖర్‌తో పాటు అతడికి సహకరించిన వెంకటసత్యనారాయణను కూడా పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

సహకార సంస్థల బలోపేతానికి కృషి

కోఆపరేటివ్ సొసైటీ అడిషనల్ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు

వ్యవసాయ యూనివర్సిటీ, మే 31: రెండు తెలుగు రాష్ట్రాల సహకార సంస్థల ఆర్థిక బలోపేతాని మరింత కృషిచేయాలని ఇనిస్టిట్యూట్ ఆఫ్ కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్ సొసైటీ అడిషనల్ రిజిస్ట్రార్(ఐసీఎం) డాక్టర్ జి.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా, రాజేంద్రనగర్ ఐసీఎం సమావేశపు మందిరంలో ఏర్పాటు చేసిన ప్రోగ్రాం అడ్వజైర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సహకార సంస్థలో సభ్యులుగా భాగస్వామ్య సంస్థల ఆర్థిక బలోపేతం ఎంతో అవసరమన్నారు. అందుబాటులో ఉన్న సాంకేతిక తను ఉపయోగించుకోవాలని సూచించారు. జవాబుదారితనం, పారదర్శకత, సహకార స్ఫూర్తి కలిగిన అంశాలు, సహకార రంగం బలోపేతానికి దోహదపడుతాయని అన్నారు. పలు సంస్థల అధికారులు, ఐసీఎం డైరెక్టర్ డాక్టర్ గణేశన్ సంస్థ కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు. డాక్టర్ బీకే బెహెరా, పీజేటీఎస్ఏయూ రిజిస్ట్రార్ డాక్టర్ రఘురామిరెడ్డి, స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎల్ఎన్‌టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పశుపోషణలో జాగ్రత్తలు తీసుకుంటే

అధిక లాభాలు

- లైవ్‌స్టాక్ హెడ్ డాక్టర్ ఆర్ఎంవీ ప్రసాద్

వ్యవసాయ యూనివర్సిటీ, మే 31: పశుపోషణ ఎంతో విలువైనదని, అనేక మార్పులకు దోహద పడుతుందని పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం లైవ్‌స్టాక్ విభాగం హెడ్(ఎంవీఎస్సీ) డాక్టర్ ఆర్ఎంవీ ప్రసాద్ అన్నారు. శుక్రవారం వర్సిటీని సందర్శించిన షాబాద్ మండలం, తిరుమలాపూర్ గ్రామానికి చెందిన పలువురు రైతుల నుద్దేశించి ఆయన మాట్లాడారు. పశుపోషన నుంచి నష్టపోకుండా లాభాలు పొందవచ్చన్నారు. ప్రస్తుతం రసాయన ఎరువులు, యాంత్రిక టెక్నాలజీ పెరుగుతున్నా ఉత్పత్తుల్లో నాణ్యత తగ్గుతుందని, అందుకే కొత్త కొత్త రోగాలు వస్తున్నాయన్నారు. పశుపోషన వల్ల నాణ్యత పెరిగి రోగనిరోదక శక్తిని పెంపొందిస్తుందని అన్నారు. పశుపోషణ వల్ల పర్యావరణం, కుటుంబం ఆరోగ్యం, పాలు, మాంసం తమతో పాటు సమాజానికి అందించగల మన్నారు. పశుపోషణను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సబ్సిడీని ఉపయోగించుకోవచ్చన్నారు. పశువులు అనారోగ్యానికి గురైనా, వాటికి గ్రాసం, తాగు నీరు కనీస వసతులు ఉంటే మంచి లాభాలు పొందవచ్చని అన్నారు.

క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలి

టాస్‌వేసిన అనంతరం ట్రోపీతో శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, నిర్వాహకులు

బండ్లగూడ, మే 31: యువత క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ అన్నారు. కిస్మత్‌పూర్‌లో ద్వారా ఫౌండేషన్ చైర్మన్ నిరుడు పవన్‌సాయి ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా స్వామిగౌడ్ విచ్చేసి టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో కలిసి క్రికెట్ మ్యాచ్ తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానిక ఉల్లాసానికి ఎంతో దోహదపడుతాయన్నారు. యువకుల్లో ఉత్సాహాన్ని నింపేందుకు దోహదపడుతున్న నిర్వాహకులు పవన్‌సాయిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కన్వీనర్ బీమార్జున్‌రెడ్డి, అర్జున్ గౌడ్, శేఖర్, సురేశ్‌గౌడ్, సురేశ్, చంద్రకుమార్, శ్రీనివాస్, భాస్కర్‌రెడ్డి, దుర్గాప్రసాద్, వెంకటేశ్, మాధవ్, ఎంకిరాళ్ల సంతోష్‌గౌడ్, గ్రామ పెద్దలు మన్నె దశరథ్, నిరుడు శ్రీరాములు, క్యాతం సత్తయ్య, నర్సింగ్‌రావు, మల్లేశ్‌యాదవ్, ఆంజనేయులు, మాస్టర్ యూవాన్ సాయి, తదితరులు పాల్గొన్నారు.

బస్తీవాసులకు ఇబ్బంది లేకుండా చూడండి

బంజారాహిల్స్, మే 31: నిమ్స్ విస్తరణ పనుల్లో భాగంగా రామకృష్ణనగర్ బస్తీకి చెందిన మంచినీటి లైన్లు, సీవరేజీ లైన్లు దెబ్బతినకుండా చూడాలని ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి ఆర్ అండ్ బీ అధికారులను కోరారు. కొత్తగా నిర్మిస్తున్న నిమ్స్ భవనాల కోసం జరుపుతున్న తవ్వకాల్లో బస్తీకి చెందిన లైన్లు దెబ్బతింటున్నాయని, దీంతో మంచినీటి సమస్యలతో పాటు సీవరేజీ సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఇటీవల ఆందోళన వ్యక్తం చేయడంతో కార్పొరేటర్ విజయారెడ్డి కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించారు. శుక్రవారం ఆర్ అండ్ బీ, జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులు, కార్పొరేటర్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. బస్తీవాసులు తమ అభ్యంతరాలను అధికారులకు వివరించడంతో బస్తీకి సమస్యలు లేకుండా చూస్తామని వారు హామీ ఇచ్చారు.

బస్తీవాసుల అభ్యంతరాలను పరిశీలిస్తున్న అధికారులు, కార్పొరేటర్ విజయారెడ్డి

రేసింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తులపై కేసులు

బంజారాహిల్స్, మే 31: అర్ధరాత్రి వేళ అతివేగంతో వెళ్తూ రేసింగ్‌లకు పాల్పడుతున్న యువకులను పట్టుకునేందుకు బంజారాహిల్స్ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో పలువురు యువకులపై కేసులు నమోదయ్యాయి. కొంతకాలంగా కేబీఆర్ పార్కు చుట్టూ బైక్‌లు, కార్లతో రేసింగ్‌లు జరుగుతున్నాయని ఫిర్యాదులు రావడంతో బంజారాహిల్స్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. గురువారం అర్ధరాత్రి సమయంలో కేబీఆర్ పార్కువద్ద నిఘా పెట్టిన పోలీసులకు సైలెన్సర్ లేకుండా అతివేగంగా వెళ్తున్న ఫోక్స్ వాగన్ పోలో కారు (టీఎస్09ఎఫ్ 1911) కనిపించింది. కారును స్వాధీనం చేసుకున్న పోలీసులు ఎర్రగడ్డకు చెందిన సయ్యద్ హషమ్ తాహా(22) అనే యువకుడితో పాటు కారులో ఉన్న ఆనంద్‌నగర్‌కాలనీకి చెందిన జునాయిద్ బిన్ మహ్మద్ (22) పై కేసు నమోదు చేశారు. తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో కేబీఆర్ పార్కువద్ద భారీ శబ్దాలు కలిగిస్తూ అత్యంత ప్రమాదకరమైన రీతిలో రేసింగ్‌కు పాల్పడుతున్న రెండు బైక్‌లను పోలీసులు ఆపారు. గాజుల రామారం ప్రాంతానికి చెందిన దాడి జగన్(19) అనే విద్యార్థి నడిపిస్తున్న బీఎండబ్ల్యూ 100 ఆర్ఆర్ బైక్(టీఎస్07హెచ్‌యూ 9336)ను, సనత్‌నగర్‌కు చెందిన సయ్యద్ ఇంతియజ్(19) అనే విద్యార్థికి చెందిన కవాసాకీ హయాబుసా బైక్(ఏపీ 09సీ 3474)ను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రేమిస్తున్నానంటూ నమ్మించి మోసం

- యువకుడి సహా కుటుంబసభ్యులపై కేసు

బంజారాహిల్స్, మే 31: ప్రేమిస్తున్నానని నమ్మించి యువతిని మోసం చేయడంతో పాటు కాల్ రికార్డింగ్స్ బయటపెడుతామంటూ బెదిరిస్తున్న యువకుడితో పాటు అతడి కుటుంబసభ్యులపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్‌కు చెందిన సాయిపవన్‌కు రెండేండ్ల కిందట విజయవాడకు చెందిన యువతి(22)తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. వారిద్దరూ పెళ్లిచేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అయితే, వీరి ప్రేమ విషయం ఇంట్లో తెలియడంతో సాయిపవన్ సోదరి స్పందన రంగంలోకి దిగింది. పెద్దలను ఒప్పించిన తర్వాత పెళ్లి చేస్తామని, అప్పటి వరకు ఒకరితో ఒకరు మాట్లాడుకోవద్దంటూ షరతు విధించింది. అంగీకరించిన యువతి విజయవాడకు వెళ్లిపోయింది. కొన్నాళ్ల తర్వాత ఫోన్లు చేసినా పట్టించుకోకపోవడంతో పాటు అవమానకరంగా మాట్లాడటం ప్రారంభించారు. దీంతో బాధిత యువతి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఆరునెలల్లో పెళ్లి చేసుకుంటానంటూ సాయిపవన్ పేపర్ రాసిచ్చి.. కేసు నుంచి బయటపడ్డాడు. ఆ తర్వాత సాయి పవన్‌తో పాటు అతడి సోదరి స్పందన, తల్లి సునీత తనను తీవ్రస్థాయిలో దూషించడంతో పాటు తమ మధ్యన జరిగిన రికార్డింగ్స్ బయట పెట్టి పరువు తీస్తామంటూ బెదిరిస్తున్నారని, తనను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ శుక్రవారం బాధిత యువతి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఐపీసీ 420, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులే కీలకం

ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ రాధిక రెడ్డి

బండ్లగూడ, మే 31: ఉత్తమ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర అని ప్రముఖ డెంటిస్ట్ డాక్టర్ రాధిక రెడ్డి పేర్కొన్నారు. బండ్లగూడ సరస్వతి విద్యాపీఠంలో రాష్ట్రస్థాయి శిశుమందిర్ నూతన ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శిశు మందిరాలు ఉన్నతమైన విద్యతోపాటు విలువలను అందిస్తూ విద్యార్థులను ఉన్నత శిఖరాలకు ఎదిగేలా తీర్చిదిద్దుతున్నాయన్నా రు. కార్యక్రమంలో సరస్వతీ విద్యాపీఠం ప్రాంత సంఘటన కార్యదర్శి పతకమూరి శ్రీనివాస రావు, ప్రాంత కార్యదర్శి ముక్కాల సీతారాములు, ప్రాంత శిక్షణ ప్రముఖ్ కృష్ణమాచార్యులు, భాగ్యనగర్ విభాగ్ సేవా ప్రముఖ్ భల్లా మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఖబరస్తాన్ కోసం నిరసన ప్రదర్శన

ప్రదర్శనలో పాల్గొన్న దక్కన్ మైనార్టీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

జూబ్లీహిల్స్, మే 31: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఖబరస్తాన్ లేకపోవడంతో పదేండ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని దక్కన్ మైనార్టీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. శుక్రవారం నమాజ్ ఇ జుమ్మా తరువాత యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్‌లోని మసీద్ ఇ ఇబ్రహీం నుంచి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ విషయమై ఇప్పటికే పలు మార్లు స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలకు వినతిపత్రాలు ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానికంగా 18 మసీదుల్లో సంతకాల సేకరణ చేపట్టారు.

నిమ్స్ దవాఖానలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులు శుక్రవారం విమరణ పొందారు. లెర్నింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప విరమణ పొందిన ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. స్టాఫ్ నర్సు తిరుపతమ్మ, ఫైనాన్స్ కంట్రోలర్ శ్రీధర్, ల్యాబ్ అసిస్టెంట్ గిరిధర్, ఏసీ మెకానిక్ నాగేశ్వర్‌రావు, సీనియర్ రేడియోగ్రాఫర్ తిరుపతిరావు, సీనియర్ ఫార్మసిస్టు ఉషారాణి ఉద్యోగ విమరణ పొందిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్ శాంతి వీర్, డాక్టర్ ఉషా తదితరులు పాల్గొన్నారు.

– ఖైరతాబాద్

హక్కుల సాధనకు కార్మికులు ఉద్యమించాలి

మైలార్‌దేవ్‌పల్లి, మే 31: హక్కుల సాధనకు కార్మికులు ఉద్యమించాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు జాజాల రుద్ర కుమార్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.రామ్మోహన్‌రావు అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాటేదాన్ డంపింగ్ యార్డులో సీఐటీయూ నాయకులు, కార్మికులతో సమావేశాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. రాజేంద్రనగర్ మండల పరిధిలో తడి, పొడి చెత్తను తరలిస్తున్న హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ మున్సిపల్ సాలిడ్ వేస్ట్(హెచ్ఐఎండీడబ్ల్యూ) ఎంప్లాయిస్ యూనియన్ డ్రైవర్స్, హెల్పర్స్ సమావేశానికి అతిథులుగా రుద్రకుమార్, రామ్మోహన్‌రావు, జి.కురుమయ్య, బి.స్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కష్టానికి తగిన ప్రతిఫలం సాధించేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. 8 గంటల పనికి బదులుగా అదనంగా ట్రిప్పులు వేయిస్తూ 10 గంటల వరకు పని చేయిస్తూ.. శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారని విమర్శించారు. తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. డ్రైవర్స్, హెల్పర్స్, సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక..

కాటేదాన్ డంపింగ్ యార్డులో నిర్వహించిన డ్రైవర్స్, హెల్పర్స్ యూనియన్ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మోహన్ బాలకృష్ణ, అధ్యక్షుడిగా బి.శ్రీరాములు, ఉపాధ్యక్షులుగా ఓబులేశ్, రాజు, కార్యదర్శిగా జై శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా బాలకృష్ణ, శంకర్, కోశాధికారిగా అజీజ